క్లుప్తంగా

నిధులు మంజూరు చేయండి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

మణుగూరుటౌన్: పినపాక నియోజకవర్గంలోని పలు గ్రామాలకు అవసరమైన బీటీ రోడ్లు, డ్రెయినేజీలు, లైటింగ్, రోడ్ల వెడల్పు, బ్రిడ్జిల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని ఆర్అండ్బీ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డిని ఆదివారం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హైదరాబాద్‌లో కలిశారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన మంత్రి.. వీలైనంత త్వరగా నిధులు మంజూరు చేస్తానని హామీనిచ్చారని ఎమ్మెల్యే పాయం ఓ ప్రకటనలో తెలిపారు.

ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

చంద్రుగొండ: ఎంపీ రఘురామిరెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఖమ్మంలో కలిశారు. చంద్రుగొండలోని వ్యవసాయ మార్కెట్ గోదాముల్లో నెలకొన్న సమస్యలను ఎంపీ ఎదుట ప్రస్తావించారు. మార్కెట్ ప్రాంగణంలో పెరిగిన చెట్లను తొలగించాలని, వేబిడ్జిని రైతులకు ఉపయోగంలోకి తీసుకురావాలని, సీసీఐ కేంద్రం మంజూరు చేయాలని ఎంపీని కోరారు. ఎంపీని కలిసిన వారిలో నాయకులు భోజ్యానాయక్, కీసరి కిరణ్‌రెడ్డి, సారేపల్లి శేఖర్ ఉన్నారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేయండి..

భద్రాచలంటౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జాక్టో 22 సంఘాల అభ్యర్థి పూల రవీందర్ కోరారు. పట్టణంలో గిరిజన అభ్యుదయ భవనంలో ఆదివారం జరిగిన జాక్టో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంత విద్యా వ్యవస్థలో నెలకొన్న సీఆర్టీల సమస్యలను పరిష్కారించి వెంటనే వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో భాషా పండితులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుల అప్‌గ్రేడేషన్, జీవోలులో తప్పులను సరిచేసి దీర్ఘకాలికంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కల్లూరి జయబాబు, రాములు, సర్వేశ్వరరావు, సత్యనారాయణ, హీరాలాల్, లక్ష్మణ్, గాంధీ పాల్గొన్నారు.

జిల్లా కమిటీలోకి మండల నాయకులు

దమ్మపేట: సీపీఎం జిల్లా కమిటీ సభ్యులుగా, దమ్మపేట మండలానికి చెందిన ఇద్దరూ సీపీఎం పార్టీ నాయకులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలానికి చెందిన పిట్టల అర్జున్ జిల్లా కమిటీ సభ్యుడిగా వరుసగా మూడోసారి ఎంపిక కాగా మోరంపూడి శ్రీనివాసరావు, మొదటిసారిగా జిల్లా కమిటీ సభ్యుడిగా ఎంపికయ్యారు. ఈ ఎంపిక పార్టీ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు జరిగిందని, ఎన్నిక కాబడిన సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తమను ఏకగ్రీవంగా ఎంపిక చేసిన పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ నిర్ణయాల మేరకు రానున్న కాలంలో ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పోరాటాలు చేస్తామని తెలిపారు.

వాడవాడలా ఉత్సవాలు నిర్వహించాలి

అశ్వాపురం: ఈ నెల 26న మండలంలో సీపీఐ పార్టీ శతజయంతి ఉత్సవాలు వాడవాడలా ఘనంగా నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.అయోధ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన మండల పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 28న పార్టీ జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కమటం వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి అనంతనేని సురేష్, అంగన్‌వాడీ యూనియన్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రెడ్డి అరుణ, నాయకులు అనంతనేని శేఖర్, సురేందర్‌రెడ్డి, ఎడెల్లి శ్రీను, క్రాంతిరెడ్డి, రాయపూడి రాజేష్, సీతమ్మ పాల్గొన్నారు.

వెంకటస్వామికి నివాళి

అశ్వారావుపేటరూరల్: మాజీ కేంద్ర మంత్రి జి.వెంకటస్వామి వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక వ్యవసాయ కళాశాలలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్లు మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన పోరాటాలు మారువలేని అన్నారు. అలాగే కేంద్ర మంత్రిగా బడుగు బలహీన వర్గాలకు, కార్మికుల పక్షాన నిలబడ్డారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు, ప్రొఫెసర్లు డాక్టర్ రాంప్రసాద్, డాక్టర్ పి.రెడ్డిప్రియ, డాక్టర్ ఆర్.శ్రావణ్ కుమార్, డాక్టర్ లక్ష్మణ్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మణుగూరు దశను మార్చిన 'సింగరేణి'

- వేలాది మందికి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు
- సీఎస్ఆర్ నిధులతో పరిసర ప్రాంతాల అభివృద్ధి
- నేటితో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న మణుగూరు సింగరేణి

మణుగూరుటౌన్: దక్షిణ భారతానికి వెలుగులు అందిస్తూ ఉత్తర తెలంగాణ దిశను మార్చిన సిరుల వేణి మణుగూరు అభివృద్ధికి ప్రత్యక్షంగా, పరోక్షంగా తన వంతు సహకారం అందించి దశను మార్చేసింది. పూర్తి ఏజెన్సీ నియోజకవర్గమైన పినపాకలో మండల కేంద్రంగా ఉన్న మణుగూరులో వేలాది మందికి ఉపాధి, లక్షలాది మందికి పరోక్ష జీవనాధారం చూపించింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కోట్లాది రూపాయలను అందిస్తూ ప్రగతి పథంలో దూసుకుపోతోంది. మణుగూరుతో పాటు సమీప గ్రామాల అభివృద్ధిలో తన వంతు పాత్ర పోషిస్తోంది.

మణుగూరులో సింగరేణి గనులు 1974 పీకే-1 భూగర్భగనిగా ప్రారంభమై అంచలంచెలుగా విస్తరిస్తూ నేటితో 50 సంవత్సరాలు పూర్తి కావస్తున్న నేపథ్యంలో సాక్షి ప్రత్యేక కథనం.

వేగంగా గనుల విస్తరణ..

1974లో నాటి రాష్ట్ర ముఖ్యమంత్రి జలగం వెంగళ రావు చేతులమీదుగా ప్రారంభమైన పీకే-1, పీకే-2, పీకే-3, ఓసీ-1, ఓసీ-2, ఓసీ-3, సెంటినరీ ఓసీతో గనుల విస్తరణ వేగంగా జరిగాయి. కొన్ని మూతపడగా, ప్రస్తుతం పీకేఓసీ(ఓసీ-2, ఓసీ-4), మణుగూరు ఓసీ, కొండాపురం భూగర్భగనులను కొనసాగుతున్నాయి. సింగరేణి తోడ్పాటుతో మణుగూరు పట్టణం దినదినాభివృద్ధి చెందింది. సింగరేణి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ.. స్థానిక ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.



ఓసీ-2లో బొగ్గు ఉత్పత్తి దృశ్యం (ఫైల్)

వేలాది మందికి ఉపాధి..

రాష్ట్ర వ్యాప్తంగా పేరుగాంచిన మణుగూరులోని సింగరేణిపై వేలాది మంది ప్రత్యక్షంగా పరోక్షంగా జీవనం కొనసాగిస్తున్నారు. గనుల్లో ఉండే కాంట్రాక్ట్ అవకాశాల్లో భూ నిర్వాసితులకు ప్రాధాన్యం ఇస్తూనే ఓసీల్లో ఔట్ సోర్సింగ్ పనుల్లో డ్రైవర్లుగా, బొగ్గు రవాణాలో, బెల్ట్‌క్లీనింగ్, ఓబీ కంపెనీల్లో వర్కర్లుగా, సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీలుగా, సేల్ పికింగ్ వంటి కాంట్రాక్ట్ పనుల్లో సిబ్బందిగా ప్రస్తుతం సుమారు 3400 మంది ఉపాధి పొందుతున్నారు. అంతే కాకుండా దేశవ్యాప్తంగా మణుగూరులోని సింగరేణి బొగ్గుకు డిమాండ్ ఉండటంతో అనుసంధానంగా ఏర్పడిన బీటీపీఎస్, హెవీ వాటర్‌ప్లాంట్‌లకు లారీల ద్వారా, బకెట్ల ద్వారా బొగ్గును సరఫరా చేస్తూనే స్థానిక వ్యాపారులకు అవకాశాలు కల్పిస్తోంది. స్థానిక లారీ యజమానులకు జీవనోపాధిని కల్పిస్తోంది. బొగ్గు ఆధారితంగా ఏర్పడిన బీటీపీఎస్, హెవీవాటర్‌ప్లాంట్లల్లోనూ వందలాది మంది ఉపాధి అవకాశాలు పొందడం సింగరేణి కేంద్రంగా పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధికి సూచిక.

మణుగూరు దినదినాభివృద్ధి..

పూర్తి ఏజెన్సీ నియోజకవర్గమైన పినపాకలోని ప్రజలు సింగరేణిలోని ఆయా కంపెనీల్లో ఔట్‌సోర్సింగ్ ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకుంటూ స్థానిక యువత, నిర్వాసితులు, సమీప గ్రామ ప్రాంతాల ప్రజలు లబ్ధిపొందుతున్నారు. సింగరేణి ఏటా ఇచ్చే సీఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ) నిధులతో పరిసర గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఇటు వ్యాపారులు, డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, ఐటీఐ కళాశాలలు అభివృద్ధితో పట్టణీకరణతో పాటు రైలు ప్రయాణానికి బాటలు.. పర్యాటక రంగం అభివృద్ధి వైపు అడుగులు వేయడంతో ఈ ప్రాంతం మరింత వృద్ధి చెందుతోంది. సింగరేణి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు బాసటగా నిలుస్తూ రాష్ట్ర ఆదాయంలో తనవంతు భాగస్వామ్యాన్ని అందిస్తోంది. మణుగూరు కేంద్రంగా సింగరేణి స్థానిక ప్రజల్లో ప్రత్యేక చరిత్రను లిఖించుకుని కీర్తిని నలుదిశలా చాటుతోంది.

నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి



మాట్లాడుతున్న ఏరియా జీఎం దుర్గం రామచందర్

మణుగూరురూరల్: నిత్యసాధనతో నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ అన్నారు. మణుగూరు ఏరియాలోని పీవీకాలనీ కమ్యూనిటీ హాల్‌లో సింగరేణి కాలరీస్ వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 45వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఏరియా జీఎం రామచందర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఏరియా సింగరేణి ఉద్యోగ క్రీడాకారులు అధికోత్పత్తిలోనూ, క్రీడారంగంలోనూ అగ్రభాగాన నిలిపేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం ఏరియా గనులు, డిపార్ట్‌మెంట్ల మధ్య జరిగిన ఏరియా లెవల్ క్రీడా, సాంస్కృతిక పోటీలలో విజేతలైన కార్మికులకు ఏరియా జీఎం చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం డి.శ్యాందర్, ఏజీఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు, డీజీఎం(పర్సనల్), చీఫ్ కోఆర్డినేటింగ్ అధికారి ఎస్.రమేష్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై.రాంగోపాల్, ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.కృష్ణంరాజు, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ గౌరవ కార్యదర్శి, డీవైపీఎం పీబీ అవినాష్, సీనియర్ పిఓ సింగు శ్రీనివాస్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ జాన్ వెస్లీ, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ ఆర్.శ్రీనివాస్, ఉద్యోగ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

చర్చి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పాస్టర్లు, సంఘ పెద్దలు

దుమ్ముగూడెం: క్రిస్టమస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవులకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం మండలంలోని చిన్ననల్లబెల్లి గ్రామంలో నూతన చర్చి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రైస్తవ సోదరులు క్రిస్టమస్ పండుగను సంతోషాలతో జరుపుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేను చర్చి నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, మండల కాంగ్రెస్ నాయకులు లంకా అబ్బులు, మట్ట శివాజీ, పాయం వెంకటేష్, కుంజ శ్రీనివాస్ రావు, తోట రమేష్, కనితి సమ్మయ్య, కోడి చంటి, లంక శివ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

లంబాడీలు ఉన్నతంగా రాణించాలి



బంజారాల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ధరావత్ చందునాయక్

బూర్గంపాడు: అన్నిరంగాలలో లంబాడీలు ఉన్నతంగా రాణించాలని సారపాక మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ ధరావత్ చందునాయక్ అన్నారు. సారపాకకు సమీపంలోని పుష్కరవనం వద్ద ఆదివారం నిర్వహించిన బంజారాల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సారపాకలోని 30వేల మంది ప్రజలు లంబాడీలను ఎంతో అప్యాయంగా చూసుకుంటారని, వారి సహకారంతోనే 30 ఏళ్ల పాటు లంబాడీలు సర్పంచ్‌లు అయ్యారని అన్నారు. కుల, మతాలకు అతీతంగా అందరిని సోదరభావంతో చూడాలని, పరస్పర సహకారంతో ముందుకు పోవాలని సూచించారు. సుమారు 4వేల మంది లంబాడీలు పాల్గొన్న ఈ ఆత్మీయ సమావేశంలో రాష్ట్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, అజ్మీరా రాంజీనాయక్, అజ్మీరా వెంకన్న, జర్పుల భద్రు, సపావత్ జగన్, రాంబాబు, రఘు,సురేష్‌నాయక్, భూక్యా లక్ష్మణ్, భూక్యా ఏసు, రాంలాల్ తదితరులు పాల్గొన్నారు.

వేతనంతో కూడిన సెలవుగా ప్రకటించాలి

మణుగూరురూరల్: సింగరేణి సంస్థ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా డిసెంబర్ 23వ తేదీన వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించాలని హెచ్ఎంఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షురాడు కొడిపల్లి శ్రీలత యాజమాన్యాన్ని ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. సింగరేణికి కీర్తిప్రతిష్ఠలను అందిస్తున్న కార్మికులకు సెలవు ప్రకటించాల్సిందేనని సింగరేణి యాజమాన్యానికి, రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అలాగే ఇన్‌కమ్ టాక్స్ రద్దు, 200గజాల స్థలం కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి, సింగరేణి సీఅండ్ఎండీ బలరాంలను కోరారు.

బియ్యం వితరణ

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామానికి చెందిన బొడ్డోజు రామాచారి తల్లి వెంకటమ్మ ఇటీవల మృతి చెందింది. ఆదివారం ఆమె దశ దినకర్మలకు రామాచారితో చదువుకున్న 2000-01 పదవ తరగతి పూర్వ విద్యార్థులు క్వింటా బియ్యం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో తులసి అశోక్, గుంజాల శంకర్, మానాది వీరరాఘవులు, గొడ్ల నాగేశ్వరరావు, గూడురు శ్రీనివాస్‌రెడ్డి, దారపు శ్రీను, పసుల లింగయ్య పాల్గొన్నారు.

కేజీబీవీ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

ములకలపల్లి: కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న టీచర్ల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు రాంచరణ్ డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులతో కలసి ఆదివారం పాఠశాల వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వృత్తిపరమైన డిమాండ్ల పరిష్కారం కోసం టీచర్లు సమ్మె చేస్తున్నా.. పట్టించుకునేవారే కరువయ్యారని అన్నారు. వెంటనే చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పల్లవి, జాన్సీ, సమీర పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ములకలపల్లి: మండలపరిధిలోని నల్లముడి గ్రామానికి చెందిన పలువురికి దుప్పట్లను వితరణగా అందజేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అనుచరుడు అడపా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా, ఎస్సై కిన్నెర రాజశేఖర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. 150 మంది వృద్ధులకు, నిరుపేదలకు వీటిని అందజేశారు. మాజీ సర్పంచ్ కారం సుధీర్ పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామం చిలకలగండీ ముత్యాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం భక్తులు పూజలు చేశారు. ఉదయం నుంచే వివిధ గ్రామాల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించగా, భక్తుల సందడి నెలకొంది.

ఆలయ నిర్మాణానికి విరాళం

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామ చంద్రస్వామి ఆలయ నిర్మాణానికి భారజల కర్మాగారం ఉద్యోగి పాము శ్రీకాంత్ రూ.21,116 విరాళాన్ని ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, జాలె రామకృష్ణారెడ్డి, ఎడ్ల ప్రతాపరెడ్డి, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందాలలో అన్యాయం



రెడ్డిపాలెంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌టీయూ నాయకులు

బూర్గంపాడు: ఐటీసీ పీఎస్‌పీడీలో గుర్తింపు కార్మిక సంఘాలుగా ఎన్నికైన టీఎన్‌టీయూసీ, ఐఎన్‌టీయూసీలు వేతన ఒప్పందాలలో కార్మికులకు తీవ్ర అన్యాయం చేశాయని బీఆర్‌టీయూ అధ్యక్షుడు సానికొమ్ము శంకర్‌రెడ్డి ఆరోపించారు. ఐటీసీ పీఎస్‌పీడీ గుర్తింపు కార్మిక సంఘ ఎన్నికల ప్రచారాన్ని బీఆర్‌టీయూ, మిత్ర పక్షాల నాయకులు ఆదివారం ప్రారంభించారు. సారపాక, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామాలలో ఓటుహక్కు కలిగిన కార్మికులను కలసి తమ మేనిఫెస్టోను అందించారు. ఈ సందర్భంగా బీఆర్‌టీయూ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఐటీసీ పీఎస్‌పీడీలో జరిగిన 13 వేతన ఒప్పందాలలో కార్మికులను గుర్తింపు కార్మిక సంఘాలు మోసం చేశాయన్నారు. ప్రచార కార్యక్రమంలో యూనియన్ల నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహసంబంధాలు



టోర్నమెంట్ పోటీలు ప్రారంభిస్తున్న సీఐ అశోక్‌రెడ్డి తదితరులు

అశ్వాపురం: క్రీడలతో క్రీడాకారుల మధ్య స్నేహ సంబంధాలు బలోపేతమవుతాయని సీఐ అశోక్ రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య అన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో డాక్టర్ బీఆర్.అంబేద్కర్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆదివారం బ్రహ్మయ్య, సీఐ అశోక్‌రెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో వ్యవహరిస్తూ క్రికెట్ పోటీల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ముత్తినేని సుజాత, కాంగ్రెస్ నాయకులు వేములపల్లి రమేష్, వలబోజు మురళికృష్ణ, మల్లెం కిరణ్, భూక్యా సాయికిరణ్, కందుల శ్రీనివాస రావు, రాయల రాజేష్, టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన



కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న సంఘం నాయకులు, సభ్యులు

మణుగూరురూరల్: భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మణుగూరు అంబేద్కర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పీవీకాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. దేశ అత్యున్నత, బాధ్యాయుతమైన హోదాలో ఉండి బీఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా అమిత్‌షా తమ వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బీఆర్ అంబేద్కర్‌కు క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఏ.మంగీలాల్, జి.శ్రీనివాస్, చల్లా కాంతారావు, ముత్యాలరావు, రామల్ల విద్యాసాగర్, ఆర్ శ్రీకాంత్, డి.వంశీ, సాయిప్రవర్ష, భార్గవ్ సాయి, జాషువా, పాల్, ఈశ్వర్, అభినవ్, వికాస్, యశ్వంత్, అశ్విత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



కరకగూడెం: గ్రామస్తులకు దుప్పట్లు అందజేస్తున్న ఎస్సై

కరకగూడెం: మండలంలోని అనంతారం గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తూరు వలస ఆదివాసీ గ్రామానికి చెందిన పలువురికి వారి గ్రామంలో ఆదివారం కరకగూడెం ఎస్సై రాజేందర్ 20 దుప్పట్లు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్ కమ్యూనిటీలో భాగంగా చలి తీవ్రత దృష్ట్యా దుప్పట్లు అందజేశామని వివరించారు. యువత, గ్రామస్తులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీవీ రావు ఆశయ సాధనకు కృషి



పీవీ రావు చిత్రపటానికి పూలమాల వేస్తున్న మాలమహానాడు నాయకులు

భద్రాచలంటౌన్: మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీ రావు ఆశయాల సాధనకు కృషి చేద్దామని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు దాసరి శేఖర్ అన్నారు. పట్టణంలోని భూపతిరావు కాలనీలో మల మహానాడు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పీవీ రావు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పులమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ.. రావు సేవలను కొనియాడారు. సుమన్, గంగారావు, రమేష్, ఝాన్సీ, స్వరూప, సంకీర్తన, గంగమ్మ, శ్రీను, పాపయ్య, చిట్టిబాబు, వరుణ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అశ్వారావుపేటరూరల్: 30 ఏళ్ల తరువాత ఒకే వేదికపై కలిసిన పూర్వ విద్యార్థులు



దమ్మపేట: 50 ఏళ్ల నాటి పదో తరగతి విద్యార్థులు..

దమ్మపేట: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1973-74 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు, 50 సంవత్సరాల తర్వాత అదే పాఠశాలలో ఆదివారం కలుసుకున్నారు. అర్ధ శతాబ్దం తర్వాత దమ్మపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు, ఆనాటి ఉపాధ్యాయులు ఆనందోత్సాహలతో పరవశించిపోయారు.

ఒకరికొకరు ఆలింగనం చేసుకుని భావోద్వేగాలకు లోనయ్యారు. అలనాటి జ్ఞాపకాలు, మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను మర్యాదపూర్వకంగా శాలువాలతో సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపి, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాలను నిర్వహించుకున్నారు. ఆటల్లో గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు వసంతరావు, ప్రసాదరావు, అంజయ్య, లక్ష్మీనారాయణ పూర్వపు విద్యార్థులు రావెల్లి అజయ్‌కుమార్, పసుమర్తి ముక్తేశ్వరరావు, వీరరాఘవులు, రామబ్రహ్మం పాల్గొన్నారు.

30 ఏళ్ల తర్వాత..

అశ్వారావుపేటరూరల్: ఓ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకే వేదిక ద్వారా కలుసుకున్నారు. దాదాపు దశాబ్దాల తర్వాత నాటి స్నేహితులను కలవడంతో సంతోషంగా గడిపారు. ఆదివారం అశ్వారావుపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993-94లో చదువుకున్న విద్యార్థులు స్థానిక ఓ గెస్ట్ హౌజ్ ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా ఒకరినొకరు కలిసి అప్యాయంగా పలుకరించుకుని, ఆనాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలాగే వేదికపై ఆట, పాటలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి చేశారు.

బీసీ ఐక్యవేదిక సమావేశం



మాట్లాడుతున్న బీసీ ఐక్య వేదిక నాయకులు

భద్రాచలంఅర్బన్: ప్రజాస్వామ్యంలో మెజారిటీ ప్రజలకే రాజ్యాధికారం ఉండాలని, దానితోనే అన్ని సమస్యలకు పరిష్కార మార్గం దొరుకుతుందని బీసీ కులాల ఐక్య వేదిక నాయకులు అన్నారు. ఈ నెల 24న మాజీ ఐఏఎస్ తెలంగాణ ఇంటెలెక్చ్యువల్ ఫోరం అధ్యక్షుడు చిరంజీవులు, బీసీ సమాజ్ వ్యవస్థాపకుడు, సీనియర్ జర్నలిస్టు సంగెమ్ సూర్యారావు భద్రాచలం వస్తున్న సందర్భంగా బీసీ కులాల కన్వీనర్ బోలిశెట్టి రంగారావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీసీ కులాల ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో దాదాపు 60 శాతం ఉన్న బీసీలు.. అభివృద్ధికి, రాజకీయ అధికారానికి ఆమడ దూరంలోనే ఉన్నారన్నారు. బీసీ నాయకులు, మేధావులు బీసీలను చైతన్యం చేసేందుకు ముందుకొస్తున్నట్లు తెలిపారు. మంగళవారం భద్రాచలంలో జరిగే సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ ఐక్య వేదిక కోకన్వీనర్ తాళ్ల రవికుమార్, తమ్మల్ల వెంకటేశ్వరరావు, కడియం రామాచారి, బండారు నాగేశ్వరరావు, అనుగోజు నర్సింహాచారి, మల్లు యాదవ్, కోపానతి శాంతరావు, అనుమల్ల గంగాధర్, ఆదినారాయణ పాల్గొన్నారు.